క్లుప్తంగా

విజయమ్మను కలసిన రఘురాం



విజయమ్మను కలసిన జగనన్న ప్రోగ్రాం కోర్డినేటర్ రఘురాం

కామవరపుకోట: వైఎస్ విజయమ్మను ఎమ్మెల్సీ జగనన్న ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలసిల రఘురాం మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. కామవరపుకోట మండలం కళ్లచెరువులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ దివంగత మేడవరపు అశోక్ కుమార్ తల్లి వరాలమ్మ స్వగ్రామంలో విజయమ్మను రఘురామ్ కలిశారు.

లక్ష్మీనారసింహునికి వెండి సమర్పణ



దాత రాజీవ్ దంపతులకు రసీదును అందిస్తున్న మూర్తి

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారికి ఉండ్రాజవరానికి చెందిన గన్నమని వెంకట రాజీవ్ గురువారం రూ.1.25 లక్షలు విలువైన 985 గ్రాముల వెండి వస్తువులను సమర్పించుకున్నారు. ఆయన సతీసమేతంగా ద్వారకాతిరుమల చినవెంకన్నను, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం 790 గ్రాముల బరువు గల వెండి బిందె, 195 గ్రాముల బరువు గల వెండి గంటను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి సంబంధిత రసీదును దాతకు అందించి, సత్కరించారు.

ఏకలవ్య విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఇటీవల పార్వతీపురం జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాల నేపథ్యంలో కేఆర్‌పురం ఐటీడీఏ అధికారులు అప్రమత్తమయ్యారు. వసతిగృహాలను సందర్శించి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించడంతోపాటు గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గురువారం ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మూడు రోజులుగా రోజుకు 30 మందికి చొప్పున అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేస్తున్నట్టు సీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ బొల్లపా శారా తెలిపారు.

మద్యం శాంపిల్స్ సేకరణ



వీరబ్రహ్మం

పోలవరం రూరల్: ఇటీవల చోటు చేసుకున్న నకిలీ మద్యం ఘటనల నేపథ్యంలో పోలవరం స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం షాపులను తనిఖీ చేసి శాంపిల్స్ సేకరించినట్టు పోలవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. ఈ శాంపిల్స్‌ను రసాయనిక విశ్లేషణకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ యాప్ ద్వారా మద్యం షాపులపై నిరంతరం నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. స్టేషన్ సిబ్బందికి నిర్దిష్టంగా షాపులు కేటాయించి, యాప్‌ల ద్వారా ప్రతి రోజూ వాటిపై పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. నకిలీ మద్యం నిరోధక చర్యలు కఠినంగా అమలు చేస్తామని, నకిలీ మద్యం అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు. నకిలీ మద్యం విక్రయంపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

4వ రోజుకు శానిటేషన్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న శానిటేషన్ కార్మికులు

జంగారెడ్డిగూడెం: నాలుగు నెలల వేతనాలు విడుదల చేసే వరకు విధులు బహిష్కరిస్తామని స్థానిక ఏరియా హాస్పిటల్ శానిటేషన్ కార్మికులు ఆందోళన చేపట్టారు. స్థానిక ఏరియా హాస్పిటల్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నా గురువారం 4వ రోజూ కొనసాగింది. సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ ధర్నా చేస్తున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు జంపన వెంకటరమణ రాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంత రావులు మాట్లాడారు. నాయకులు వేముల రాజు, మేరీ, దయామణి, ప్రభావతి, సీత, కృష్ణవేణి, జె.దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా బాణసంచా అమ్మితే చర్యలు

దుకాణాల ఏర్పాటుకు అధికారుల స్థల పరిశీలన



బుట్టాయగూడెం : వాటర్ సర్వీస్ సెంటర్ వద్ద స్థల పరిశీలన చేస్తున్న అధికారులు



కొయ్యలగూడెం : దుకాణాల ఏర్పాటు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: అనుమతులు లేకుండా దీపావళి బాణసంచా సామగ్రి విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పీవీ చలపతిరావులు హెచ్చరించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలోని రెడ్డిగణపవరం, బుట్టాయగూడెం, దొరమామిడి గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటు స్థలాలను గురువారం వారు పరిశీలించారు. రెడ్డిగణపవరం, రామారావుపేట సెంటర్, బుట్టాయగూడెం శివారు వాటర్ సర్వీసింగ్ సెంటర్, దొరమామిడి సంతమార్కెట్ స్థలాలను పరిశీలించామని వారు చెప్పారు. బాణసంచా సామగ్రి దుకాణదారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. నివాస గృహాలు, స్కూల్స్, పెట్రోల్ బంక్‌లకు 50 మీటర్ల దూరంలో దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి షాపుల్లో అగ్ని నిరోధక సామగ్రి అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి దుకాణంలో నీరు, ఇసుక, బిందెలు తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. లైసెన్స్ ప్రకారం మాత్రమే పరిమితి పరిమాణంలో మందుగుండు నిల్వలు ఉంచాలని చెప్పారు. రాత్రి 10 గంటల తర్వాత విక్రయాలు చేయవద్దని అన్నారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు ట్యాంకర్‌లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై దుర్గామహేశ్వరరావు, వీఆర్‌ఓ, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటుపై పరిశీలన

కొయ్యలగూడెం: దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటు ప్రదేశాన్ని రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పరిశీలించారు. స్థానిక జంగారెడ్డిగూడెం రోడ్డులోని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ యార్డ్ ప్రాంగణంలో ఈనెల 20, 21వ తేదీల్లో నిబంధనలకు లోబడి దుకాణాలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. తహసీల్దార్ ఎస్ నాగరాజు, ఎస్సై వి.చంద్రశేఖర్, ఇతర అధికారులు నిబంధనలను దుకాణదారులకు వివరించారు.

అయ్యప్పలకు భిక్ష



కామవరపుకోటలో స్వాములకు భిక్ష వడ్డిస్తున్న రాయంకుల సత్యనారాయణ



గుర్వాయిగూడెంలో భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్పలు

కామవరపుకోట: స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో శ్రీ వీరభద్ర అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో గురువారం 14వ రోజు అయ్యప్ప మాలధారులకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటు చేశారు. స్వాములకు 50 రోజులపాటు భిక్ష ఏర్పాటు చేయడం అభినందనీయం రాయంకుల అన్నారు. అన్నదాన కమిటీ సభ్యులకు తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావు, ఎంపీటీసీ బొల్లు వెంకట సత్యనారాయణ, రామన్నపాలెం మాజీ సర్పంచ్ ఉప్పలపాటి మోహన్‌రావు, గుర్రాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్వాయగూడెంలో..

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో 15వ రోజు దాతలుగా తోర్ల లక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరాస్వామి శిష్య బృందం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటుచేశారని అయ్యప్ప ఆలయ చారిటుబల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చిన్ని వాసుస్వామి తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి కూనపార్వతి, గుంట్ల వెంకటేశ్వరరావు, కొల్లేపర కృష్ణారావు, నెక్కలపూడి సూర్యచంద్రరావు, రోకం కృష్ణారావు, ఆలయ మేనేజర్ గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సులో సీటు కోసం సిగపట్లు



జంగారెడ్డిగూడెం - భీమవరం బస్సులో సీటు కోసం కొట్టుకుంటున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ బస్సులో సీటు కోసం ఇద్దరు మహిళలు సిగపట్లు పట్టారు. తాము జనాల మధ్యలో ఉన్నామన్న విషయాన్ని మరిచి ఒకరినొకరు సీటు కోసం కొట్టుకున్నారు. ఈ ఘటన జంగారెడ్డిగూడెం - భీమవరం బస్సులో లక్కవరం గ్రామంలో చోటు చేసుకుంది. ఆర్టీసీ బస్సు జంగారెడ్డిగూడెం నుంచి భీమవరం లక్కవరం మీదుగా వెళుతోంది. బస్సు ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో లక్కవరం వద్ద ఒక మహిళ సీటులో కూర్చొనేందుకు ప్రయత్నించింది. దానికి మరో మహిళ నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ ఘర్షణ పెరిగి ఇద్దరు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పక్కనున్న వారు వారిస్తున్నప్పటికీ మహిళలు మధ్య గొడవ జరుగుతుండగానే తమ గమ్య స్థానాలు రావడంతో బస్సు దిగి వెళ్లిపోయారు.

తాగునీటి సరఫరాకు కృషి



కనకాద్రిపురంలో ప్రజలతో చర్చిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: కనకాద్రిపురం (ఆరిపాటి) ప్రజల తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక తయారు చేస్తున్నట్టు తాగునీరు, పారిశుద్ధ్య శాఖ జంగారెడ్డిగూడెం డివిజనల్ ఇంజినీర్ సురేష్, కొయ్యలగూడెం ఏఈ మురళీ కృష్ణ గురువారం తెలిపారు. కొన్ని నెలలుగా గ్రామానికి వస్తున్న మురుగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గ్రామ కార్యదర్శి యు.గంగధర్ గ్రామస్తులతో పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మంచి నీరు సరఫరా చేసే బోరు ప్రదేశంలో భూగర్భ జలాలు అడుగంటాయని, వేరొక ప్రదేశంలో జల జీవన్ మిషన్ పథకంలో నూతన బోరు నిర్మిస్తామని చెప్పారు. బోరు సమస్య తీరే వరకు గోదావరి నీటిని అందించాలని ప్రజలు కోరారు. శుక్రవారం నుంచి శుభ్రమైన నీరు ప్రజలకు అందాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సతీష్, టెక్కిన తిరుపతిరావు, ఆకుల వెంకటేశ్వరరావు, దుగ్గిరాల పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



ఉద్యానపంటను పరిశీలిస్తున్న హరినాథ్ రెడ్డి

జంగారెడ్డిగూడెం: ఉత్తమ యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ హరినాథ్ రెడ్డి అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి, గురువాయిగూడెం, చక్ర దేవరపల్లి గ్రామాల్లోని ఆయిల్‌ఫామ్, కోకో, కొబ్బరి, పిప్పళ్ల తదితర తోటలను గురువారం ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడారు. ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కోకో, కొబ్బరి, ఆయిల్ ఫామ్ తోటల్లోని అంతర్ పంటలను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్ రామ్మోహన్, జిల్లా ఉద్యాన అధికారి షాజా నాయక్, ఆర్టికల్చర్ ఏడీ సంతోష్, కొయ్యలగూడెం ఉద్యాన అధికారి పి.ధీరజ్ లక్ష్మణ్, రైతులు తడికమళ్ల గోపాలరావు, దల్లి రామాంజనేయరెడ్డి, ఉండవల్లి శ్రీనివాస్, ఇంజినీరింగ్ ప్రసాద్, రైతు సేవ కేంద్ర సిబ్బంది వెంకటేష్, నాగ చందు, రవి పాల్గొన్నారు.

వైద్యుల సమ్మెకు ఆశ వర్కర్ల మద్దతు



పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు

ద్వారకాతిరుమల: పీహెచ్‌సీ వైద్యులు పది రోజులుగా తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి అన్నారు. మండలంలోని సీహెచ్ పోతేపల్లి పీహెచ్‌సీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో, వైద్యుల సమ్మెకు సంఘీభావంగా ఆశ వర్కర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ వైద్యులకు సకాలంలో ప్రమోషన్లు ఇవ్వాలని, ఇన్‌సర్వీస్ పీజీ కోట పునరుద్ధరించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న వైద్యులకు 50 శాతం మూల వేతనం ప్రత్యేకంగా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల నాయకురాలు లలిత తదితరులున్నారు.

రుణ బకాయిలు చెల్లించండి



ముక్కంటి

చింతలపూడి: ఎస్సీ కార్పొరేషన్ లోన్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏలూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి కోరారు. ఎస్సీ కార్పొరేషన్ రుణ బకాయిదారులు, అధికారులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆయన సమావేశం నిర్వహించారు. 2015-16 2016 - 17 - 18 సంవత్సరాల్లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో 581 మందికి రుణాలు ఇవ్వగా, రూ.15.23 కోట్లు బకాయిలు ఉన్నాయని ముక్కంటి తెలిపారు. చింతలపూడి మండలంలో 13 కార్లకు రూ.83.16 లక్షల బకాయిలు ఉన్నట్టు చెప్పారు. సెల్ఫ్ ఎంప్లాయ్ స్కీమ్ కింద 38 మందికి రుణాలు ఇవ్వగా, రూ.51.98 లక్షలు పెండింగ్‌లో ఉందన్నారు. ఈ బకాయిలు కడితే కొత్తవారికి రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. బకాయిలు చెల్లించేందుకు ఎస్సీ కార్పొరేషన్ సిబ్బందిని లేదా నేరుగా తనను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నెలవుగా సీసీ రోడ్లు



కొయ్యలగూడెంలో ప్రమాదకరంగా ఉన్న సీసీ రోడ్డు ర్యాంపు

కొయ్యలగూడెం: ప్రస్తుతం ఉన్న సీసీ రోడ్లపై మరమ్మతుల్లో భాగంగా మళ్లీ వాటిపై నిర్మిస్తున్న సీసీ రోడ్లు ప్రమాదాలకు నెలవుగా మారాయని ప్రజలు పేర్కొంటున్నారు. పరింపూడి పంచాయతీ పరిధిలోని ప్రస్తుతం ఉన్న కొన్ని సీసీ రోడ్లపై మళ్లీ సీసీ రోడ్లను వేశారు. వర్షం నీరు నిలిచిపోవడం, సీసీ రోడ్లపై గోతులు పడడం వంటి వాటితోపాటు గతంలో ఉన్న సీసీ రోడ్లకు కొనసాగింపుగా సీసీ రోడ్లను నిర్మించారు. అయితే సాంకేతిక అంశాలంటూ అధికారులు గతంలో ఉన్న సీసీ రోడ్ల కంటే ఎత్తుగా వేశారు. కానీ పాత రోడ్డుకు అనుసంధానం చేసే చోట ర్యాంపును పొడిగించకపోవడం వల్ల పాత రోడ్డుపై మళ్లీ వేసిన కొత్త రోడ్డు అడుగుమేర ఎత్తుగా ఉండడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. గవరవరం గ్రామంలో కూడా ఈ విధమైన ప్రమాదకర సీసీ రోడ్లు నిర్మించారని చెబుతున్నారు. ర్యాంపులు వద్దకు వచ్చే సరికి ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ఇళ్లలోకి దూసుకొస్తున్నాయని, కొన్నిచార్లు వాహనచోదకులు పడిపోయి ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ర్యాంపులు అనుసంధానం చేయని చోట పొడిగించి ర్యాంపులను క్రమబద్ధీకరించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటికి కటకట



శ్రీరామ్ నగర్ ప్రాంతంలో ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళలు

కొయ్యలగూడెం: తాగునీటికి పరింపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని కొన్ని ప్రాంతాల ప్రజలు కటకటలాడుతున్నారు. మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కొన్నిచోట్ల ప్రైవేటు టాంకర్లను ఏర్పాటు చేసుకొని నీటిని ప్రజలు తెప్పించుకుంటున్నారు. గ్రామంలోని అతిపెద్దదైన రామాలయం వాటర్ ట్యాంక్ సిబ్బంది బాధ్యతారాహిత్యం కారణంగా తాగునీటి సరఫరా కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంపు డ్రైవర్లు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తుంటే సమాధానం ఇవ్వకపోగా అడిగిన వారి ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను నిలిపి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. సంబంధిత శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

క్యాన్సర్ నివారణపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బుట్టాయగూడెం: బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, విద్యారోహిణి విద్యా సంస్థల సంయుక్తంగా నిర్వహించే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా క్యాంప్‌కు సంబంధించి గురువారం బుట్టాయగూడెంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు రవికుమార్, క్యాంప్ ఇన్‌చార్జి లక్ష్మణ్‌లు మాట్లాడుతూ క్యాన్సర్‌పై గిరిజన ప్రాంత ప్రజలకు అవగాహన కలిగించే విధంగా ఈ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నారాయణపురం లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రకాష్, కొండేపాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి పథకాలకు విరాళం



సత్యనారాయణరెడ్డికి విరాళం బాండ్ పత్రం అందిస్తున్న నటరాజారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదానం, గోసంరక్షణ పథకాలకు ఇద్దరు భక్తులు గురువారం వేర్వేరుగా విరాళంగా రూ.1,51,116 అందజేశారు. శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి గుడివాడకు చెందిన పెద్దింటి సత్యనారాయణరెడ్డి రూ.1,01,116, గో సంరక్షణ పథకానికి రాజమండ్రికి చెందిన పిరాట్ల వెంకట లక్ష్మీనారాయణ రూ.50 వేలు ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

స్వచ్ఛతను ధ్రువీకరించాలి

జంగారెడ్డిగూడెం: ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా ప్రతి మద్యం బాటిల్ క్యూ ఆర్ కోడ్ చెల్లుబాటు, నాణ్యతను పరిశీలించి, మద్యం స్వచ్ఛతను ధ్రువీకరించాలని మద్యం షాపు, బార్ యజమానులను ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు ఆదేశించారు. ఈ మేరకు ఆయన జంగారెడ్డిగూడెంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా నాణ్యమైన మద్యం అమ్మాలని ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ రూపొందించిన సురక్ష యాప్ (ఏపీఈఎస్‌ఏ) ద్వారా ప్రతి మద్యం బాటిల్‌ను పరిశీలించాలని పేర్కొన్నారు. వినియోగదారులు తమ మొబైల్‌లో ఏపీఈఎస్‌ఏ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని కొనుగోలు చేసే బాటిల్ నాణ్యతను స్వయంగా పరిశీలించుకోవచ్చని తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్) / ఏలూరు (ఆర్ఆర్‌పేట) : మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులకు మూడు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రకళ, ఎం నాగమణి ఒక ప్రకటన విడుదల చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం పథకంలో జిల్లాలో పనిచేస్తున్న 3200 మంది కార్మికులు మూడు నెలల నుంచి వేతనం కానీ, బిల్లులు కానీ ప్రభుత్వం చెల్లించలేదని పేర్కొన్నారు. ఈ పథకాన్ని ఇప్పటికే కార్మికులు తన సొంత పెట్టుబడులతో నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ పథకానికి వెంటనే బడ్జెట్ కేటాయించాలని, కార్మికులకు నెలనెలా 5వ తేదీలోపు వేతనం చెల్లించాలని, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామవరపుకోట: అంకాలంపాడు సబ్‌స్టేషన్ కొత్త బ్రేకరు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఫీర్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తూరు ఇండస్ట్రియల్ వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ ఉదయం నాలుగు గంటలకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

పేదలకు పట్టాలివ్వాలి

టి.నరసాపురం: మిగులు భూముల్లో సాగు చేస్తున్న పేదలకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం టి.నరసాపురంలో ఆయన మాట్లాడుతూ అల్లంచర్ల, రాజుపాలెం పంచాయతీల్లో ఉన్న సుమారు 1500 ఎకరాలు రెవెన్యూ, అటవీశాఖ భూముల్లో సాగులో ఉన్న పేదలకు అడ్డుకోవడం తగదన్నారు. పేదల సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

22న వాహనాల వేలం

జంగారెడ్డిగూడెం: ప్రాంతీయ రవాణా అధికారి పరిధిలో సీజ్ చేసిన వాహనాలకు స్థానిక ఆర్టీసీ బస్ డిపో వద్ద ఈ నెల 22న వేలం వేయనున్నట్టు రవాణా శాఖ అధికారి ఎస్ఎస్ రంగనాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.5 వేలు దరావతు చెల్లించి పాల్గొనాలని, వేలం దక్కించుకున్న వారు జీఎస్టీతో కలిసి వాహనం సొమ్మును చెల్లించాలని, ఇతర వివరాలకు జంగారెడ్డిగూడెం ప్రాంతీయ రవాణా కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. మూడు మోటార్ సైకిళ్లు, ఏడు గూడ్స్ వాహనాలు, ఆరు మాక్సీ క్యాబ్‌లు జంగారెడ్డిగూడెం బస్ డిపో వద్ద, మాక్సిక్యాబ్, మోటార్ క్యాబ్ కుక్కునూరు ఫైర్‌స్టేషన్ వద్ద అందుబాటులో ఉంటాయని, వీటిని పరిశీలించుకోవచ్చని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ద్వారకాతిరుమల: స్థానిక కొత్త బస్టాండ్ వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. గ్రామానికి చెందిన టి.నాగరాజు, కామవరపుకోట మండలం తాడిచర్లకు చెందిన కె.అంజిబాబు బైక్‌పై ద్వారకాతిరుమల నుంచి తాడిచర్లకు వెళుతున్నారు. అయితే ఘటనా స్థలం వద్ద ఆగిన వీరి బైక్‌ను, వెనుక నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ నాగరాజు, అంజిబాబులను స్థానికులు వెంటనే పీహెచ్‌సీకి తరలించారు.

నేడు ఏలూరులో సదస్సు

జంగారెడ్డిగూడెం: విద్యా, ఉపాధి రంగాల సంక్షోభం - విద్యార్థి, యువకుల ఆత్మహత్యలు అనే అంశంపై ఈనెల 17న ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలోని అల్లూరు సత్యనారాయణ భవన్‌లో పీడీఎస్‌ఓ- ఎన్‌వైఎస్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పీడీఎస్‌ఓ జిల్లా నాయకులు క్రిస్టిబాబు కోరారు. ఈ మేరకు స్థానిక ఓ కళాశాలలో ప్రచారం చేశారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు పెనుమర్తి సురేష్‌బాబు, కార్యదర్శి సంధ్యా ప్రవళిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 23 మందికి ప్రతిభా పురస్కరాలు గురువారం రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి అందజేశారు. సన్మాన గ్రహీతలను అభినందించారు. జయవరపు సోమశేఖర్, మల్లాది సీతారామారావు, పాలపర్తి శ్రీనివాస్, సింగంశెట్టి హరిబాబు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

హాస్టల్‌కు ఫ్యాన్ల బహూకరణ

కొయ్యలగూడెం: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి విద్యార్థుల సౌకర్యార్థం ఐదు సీలింగ్ ఫ్యాన్లను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. కల్పవృక్ష వృద్ధాశ్రమంలో వృద్ధులకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాదేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వ్యాయామ పరికరాలను క్లబ్ జిల్లా గవర్నర్ కళ్యాణ చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రూపాయికే బీఎస్ఎన్ఎల్ సిమ్

ఏలూరు (టూటౌన్): దీపావళి సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఒక్క రూపాయికే సిమ్, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటా,100 ఎస్ఎంఎస్‌లు, 30 రోజుల కాల వ్యవధిలో అద్భుతమైన కొత్త ప్లాన్‌ను అందిస్తున్నట్టు టెలికాం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మేనేజర్ ఎల్ శ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్లాన్ నవంబరు 15వ తేదీ వరకు ఉంటుందని, ఇది పోర్టబిలిటీలకు కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. పూర్తి వివరాలకు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.